

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM


# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

ఆంధ్రప్రదేశ్ ( క్రిష్ణ) శుక్రవారం 17-07-2026 సంపుటి: 01 సంచిక : 13 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Andhrapradesh(Krishna) Friday, 17-07-2026 Volume :01 Issue: 13 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

## అమెరికా కంటే చైనాకే మొగ్గు..



- ప్యూ సర్వేలో ఆసక్తికర అంశాలు
- 36 దేశాల్లో సర్వే.. 25 దేశాల ప్రజల అభిప్రాయం చైనా వైపు
- ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అధిక ఆదరణ.. సర్వేలో వెల్లడి
- చైనా పట్ల పెరుగుతున్న సానుకూలత.. అమెరికాపై తగ్గుతున్న విశ్వాసం
- స్వేచ్ఛా హక్కుల్లో అమెరికాకు ఆధిక్యం.. జోక్యం విషయంలో చైనాకు మద్దతు
- యూరప్ దేశాల్లోనూ చైనా వైపు పెరుగుతున్న ఆసక్తి
- భారత్, జపాన్, దక్షిణ కొరియా సహా ఆరు దేశాలే అమెరికా అనుకూలం

3

## మయన్మార్ తీరంలో ఘోర విషాదం..



- రెండు శరణార్థి పడవలు బోల్తా
- 500 మందికి పైగా గల్లంతు.. మృతి చెందినట్లు ఐరాస సంస్థల అంచనా
- రఖైన్ నుంచి బయలుదేరిన పడవలు.. ఎక్కువ మంది రోహింగ్యా ప్రయాణికులు
- బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారూ ఉన్నట్లు సమాచారం
- భారీ ప్రాణనష్టంపై ఐరాస ఆందోళన
- అండమాన్ సముద్రం, బంగాళాఖాతం మార్గం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- తొలి పడవలో 250 మంది.. రెండో పడవలో 280 మంది ప్రయాణికులు

2

# సెప్టెంబర్లో పురపోరు!

### తర్వాత జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు



- చివరిగా గ్రామ పంచాయతీలకు
- స్థానిక సమరానికి సిద్ధమవ్వండి
- ఈ ఎన్నికల్లో 3 పార్టీల నడుమ 80:15:5 నిష్పత్తిలో సీట్ల పంపిణీ
- టీడీపీ కో-ఆర్డినేటర్లకు లోకేశ్ స్పష్టీకరణ
- 27 నుంచి 'ఇంటింటికీ టీడీపీ'

**అమరావతి,**

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరులో నిర్వహించేందుకు ముహూర్తం దాదాపు ఖరారైంది. టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్లతో గురువారం టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ సమావేశమయ్యారు. కొత్తగా జోనల్ కో ఆర్డినేటర్లను నియమించిన తర్వాత జరిగిన ఈ తొలి భేటీలో స్థానిక ఎన్నికలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని లోకేశ్ వారికి సూచించారు. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు జరుగుతాయని.. చివరిగా పంచాయతీ ఎన్నికలు ఉంటాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కూటమి

-మిగతా 2లో



## అవినీతి చేస్తే వేటే..

- మంత్రులు, అధికారులకు సీఎం విజయ్ హెచ్చరిక
- లంచాలు, అక్రమాలకు చోటు లేదు..
- ప్రజలకు జవాబుదారీ పాలనే ధ్యేయమన్న తమిళనాడు ముఖ్యమంత్రి
- ఆరోపణలపై సొంత పార్టీ నేతపైనే చర్యలు తీసుకున్న విజయ్
- అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన సీఎం
- లంచం అడిగితే ఎదిరించండి.. ప్రజలకు విజయ్ భరోసా
- తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని స్పష్టం

**న్యూఢిల్లి**

తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు.ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్ కావడంతో.. రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా

-మిగతా 2 లో




### హస్త కళాకారులకు అండగా
## కూటమి ప్రభుత్వం

- భారత్ టెక్స్‌లో ఏపీ స్టాల్‌ను సందర్శించిన మంత్రి సవిత
- నేడు ఢిల్లీలో లేపాక్షి ఎంపోరియం ప్రారంభం

**న్యూఢిల్లీ,**

చేనేత, హస్తకళల రంగాన్ని బలోపేతం చేసేందుకు, కళాకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 'భారత్ టెక్స్ 2026' అంతర్జాతీయ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ (లేపాక్షి) పెవిలియన్‌ను ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ(లేపాక్షి) చైర్మన్ హరిప్రసాద్‌తో కలిసి మంత్రి సవిత గురువారం సందర్శించారు. పెవిలియన్‌లోని వివిధ స్టాళ్లను పరిశీలించి, హస్తకళాకారుల నైపుణ్యాన్ని అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు,

-మిగతా 2 లో




## న్యూజిలాండ్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రత నమోదు
- తే అనావ్ సమీపంలో కంపించిన భూమి.. 40 కి.మీ. దూరంలో కేంద్రం
- తొలుత 6.3గా అంచనా.. తాజా విశ్లేషణలో 5.9గా నిర్ధారణ
- సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు
- హెచ్చరికల నుంచి సలహాకు మార్పు.. తగ్గిన ముప్పు స్థాయి
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- సముద్రంలోకి వెళ్లొద్దు.. బీచ్‌లకు దూరంగా ఉండాలని పర్యాటకులకు పిలుపు

2

న్యూజిలాండ్‌లో భూకంపం కలకలం సృష్టించింది. దక్షిణ ద్వీపం సమీపంలోని సముద్ర గర్భంలో 5.9 తీవ్రతతో బలమైన ప్రకంపనలు నమోదయ్యాయి. తొలుత భూకంప తీవ్రతను 6.3గా అంచనా వేసిన అధికారులు, అనంతరం తాజా విశ్లేషణల ఆధారంగా దాన్ని 5.9గా సవరించారు. భూకంప కేంద్రం తీర ప్రాంతానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు గుర్తించారు. భూకంపం సంభవించిన వెంటనే న్యూజిలాండ్ అధికారులు అప్రమత్తమయ్యారు. దక్షిణ ద్వీపంలోని తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిల్‌ఫోర్డ్ సౌండ్ నుంచి పుయిసెగర్ పాయింట్ వరకు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే పరిస్థితిని సమీక్షించిన తర్వాత సునామీ ముప్పు స్థాయిని తగ్గించారు. ప్రస్తుతం పెద్దగా ప్రమాదం లేదని భావిస్తున్నప్పటికీ, తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. సముద్రంలో అసాధారణ అలలు, నీటి మట్టంలో మార్పులు కనిపించే అవకాశం ఉందని హెచ్చరించారు.




## శవపేటికలో ట్రంప్!

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వేళ తీవ్ర వ్యాఖ్యలతో పోస్టర్
- ఖమేనీ మరణానికి ప్రతీకారం కోరుతున్న ఇరాన్ వర్గాలు
- యుద్ధ పరిణామాలతో అమెరికాపై పెరిగిన వ్యతిరేకత
- ట్రంప్ చిత్రంతో కూడిన హోర్డింగ్ అంతర్జాతీయ చర్చకు దారి
- టెహ్రాన్ వీధుల్లో కనిపించిన ఆగ్రహ సంకేతం

2



## 22న 'తల్లికి వందనం'

- ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున 42.7 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జమ
- ఈ ఏడాది రూ.10,120 కోట్ల చెల్లింపు
- తొలి విడతలో 64.76 లక్షల మందికి లబ్ధి
- కొత్త అడ్మిషన్లు, వినతుల పరిశీలన తర్వాత ఆగస్టు 30న రెండో విడత
- ఈసారి అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకూ..

**అమరావతి,**

రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులను విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ ఏడాది ఈ పథకం కింద రూ.10,120.78 కోట్లు చెల్లించేందుకు అనుమతి ఇచ్చింది. మొత్తం 67.47 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి 42.7 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున నగదు జమ చేయనున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.2 వేలు మినహాయిస్తారు. ఈ ఏడాది 17 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా ఈ పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసింది. 1వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు అర్హులు. ఈ మేరకు తల్లికి వందనం నిధులు

-మిగతా 2 లో

# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

### పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి

- ప్రతి ప్రభుత్వ శాఖకూ ఓ ఫైనాన్షియల్ ప్లాన్
- నిరర్థకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం
- మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు
- పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి,**

భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంక్షేమణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టాల్సిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు,

-మిగతా 2 లో





## ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

- అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులసమావేశంలో కేటీఆర్

**హైదరాబాద్**


కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్ష? సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ

-మిగతా 2లో

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# న్యూజిలాండ్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రత నమోదు
- తే అనావ్ సమీపంలో కంపించిన భూమి.. 40 కి.మీ. దూరంలో కేంద్రం
- తొలుత 6.3గా అంచనా.. తాజా విశ్లేషణలో 5.9గా నిర్ధారణ
- సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు
- హెచ్చరికల నుంచి సలహాకు మార్పు.. తగ్గిన ముప్పు స్థాయి
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- సముద్రంలోకి వెళ్లొద్దు.. బీచ్‌లకు దూరంగా ఉండాలని పర్యాటకులకు పిలుపు




న్యూఢిల్లీ
న్యూజిలాండ్ లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలు పై దాని తీవ్రత 5.9 గా నమోదైంది. సౌత్ ఐలాండ్ లోని 'తే అనావ్ ' పట్టణానికి సమీపంలో భూకంపం సంభవించడంతో అధికారులు తొలుత సునామీ హెచ్చరికలు జారీచేశారు. అయితే ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఆ హెచ్చరికను కేవలం సునామీ సలహాగా సవరించారు. తే అనావ్ పట్టణానికి ఉత్తరంగా దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ప్రారంభంలో ఈ భూకంప తీవ్రతను 6.3 గా అంచనా వేసిన అధికారులు.. సౌత్ ఐలాండ్ పశ్చిమ తీర ప్రాంతాలైన మిల్‌ఫోర్డ్ సౌండ్ నుంచి పుయ్‌సెగర్ పాయింట్ వరకు సునామీ హెచ్చరికలు జారీచేశారు. అయితే ఖచ్చితమైన అంచనాల ఆధారంగా భూకంప తీవ్రతను 5.9గా నిర్ధారించి సునామీ హెచ్చరికను తగ్గించారు. ప్రస్తుతానికి సునామీ ముప్పు లేనప్పటికీ, న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. తీర ప్రాంతాల్లో బలమైన, అసాధారణమైన అలల కదలికలు, అంచనా వేయలేని నీటి ఉప్పెనలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నది. ప్రజలు, పర్యాటకులు సముద్రంలోకి వెళ్లవద్దని, బీచ్‌లకు దూరంగా ఉండాలని సూచించింది.

# శవపేటికలో ట్రంప్!

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వేళ తీవ్ర వ్యాఖ్యలతో పోస్టర్
-ఖమేనీ మరణానికి ప్రతీకారం కోరుతున్న ఇరాన్ వర్గాలు
-యుద్ధ పరిణామాలతో అమెరికాపై పెరిగిన వ్యతిరేకత
-ట్రంప్ చిత్రంతో కూడిన హోర్డింగ్ అంతర్జాతీయ చర్చకు దారి
- టెహ్రాన్ వీధుల్లో కనిపించిన ఆగ్రహ సంకేతం




న్యూఢిల్లీ
పరస్పర దాడులు ఉధృతమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒక నల్ల శవపేటికలో పడుకోబెట్టిన భారీ హోర్డింగ్ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ప్రధాన ఎంగెలాబ్ స్క్వేర్‌లో వెలిసింది. కళ్లు మూసుకుని, జుట్టు చెదిరిపోయి పడుకుని ఉన్న ట్రంప్‌ను చూపిస్తున్న ఆ బిల్‌బోర్డుపై మేము ట్రంప్‌ను చంపుతాము అన్న వాక్యాలు రాసి ఉన్నాయి. ఇరాన్ తనపై హత్యాయత్నం చేసే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించిన కొద్ది రోజులకే ఈ బిల్‌బోర్డు ఏర్పాటు కావడం గమనార్హం.మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని ప్రభుత్వానికి సన్నిహితులైన ఇరాన్ పిడివాదులు పిలుపునిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. యుద్ధం ప్రారంభమైన మొదటిరోజే మరణించిన ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు వారం రోజులపాటు కొనసాగాయి. ఈ సమయంలో అమెరికాపై ప్రజల్లో పేరుకుపోయిన ఆగ్రహం స్పష్టంగా కనిపించింది

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారా యని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

# 22న 'తల్లికి వందనం'

విడుదల షెడ్యూలు, మార్గదర్శకాలు, పరిపాలనా అనుమతుల ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. తొలి విడతగా 64,76,590 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ కానుంది. తర్వాత 22వ తేదీ నుంచి ఆగస్టు 3 వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారు. ఆ వినతులను ఆగస్టు 4 నుంచి 10 వరకు పరిశీలిస్తారు. మరోవైపు ఆగస్టు 25 వరకు ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లకు గడువు ఉంది. ఈ క్రమంలో కొత్త అడ్మిషన్లు, వినతులను పరిశీలించి ఆగస్టు 30న రెండో విడత అర్హుల జాబితాలను ప్రదర్శిస్తారు. అదే రోజున తల్లికి వందనం నగదును విడుదల చేస్తారు. ఈ ఏడాది ఒకటో తరగతిలోకి 59,500, ఇంటర్ ఫస్టియర్‌లోకి 56,100 కొత్త అడ్మిషన్లు వస్తాయని అంచనా. ఇంటింటి సర్వేలో దొరకని 1,55,000 విద్యార్థుల రికార్డులను సరిచేసి, వారిని కూడా అర్హుల జాబితాలో చేరుస్తుంది. దీంతో ఈ ఏడాది మొత్తం 67.47 లక్షల మంది విద్యార్థులకు పథకం నగదు అందించేలా ప్రణాళిక రూపొందించింది.

### హస్త కళాకారులకు అండగా
# కూటమి ప్రభుత్వం



కొనుగోలుదారులతో మంత్రి సవిత భేటీ అయ్యారు. అరవింద్ ఫ్యాబ్రిక్ సీఈవో డాక్టర్ పరమ్ షా, భారత్ టెక్స్ 2026 ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నరేన్ గోయెంకాతో పలు అంశాలపై చర్చించారు. తమది పెట్టుబడిదారుల అనుకూల ప్రభుత్వమని, ప్రభుత్వం తరపున అన్నివిధాలా అండగా ఉంటామని, ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సవిత వారిని కోరారు.

# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

(మొదటి తరువాయి)

ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టేందుకు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.
పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ. 1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టైనబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని.. ప్రతీ ప్రాజెక్టు పద్ధా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్థంగా నడిపేందుకు అవసరమైన మెకానిజం సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వెస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు రూ.178 కోట్ల వీజీఎఫ్ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ. 1,468 కోట్ల వీజీఎఫ్ రానుంది.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు. లివచ్ కేబినెట్కు నూతన విధానం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా అన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు.
రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఇకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని.. సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ష్ట?లు, మద్దు, దీర్ఘకాల ప్రణాళిక ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజీ రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలుచుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అమెరికా కంటే చైనాకే మొగ్గు..


-ప్యూ సర్వేలో ఆసక్తికర అంశాలు
- 36 దేశాల్లో సర్వే.. 25 దేశాల ప్రజల అభిప్రాయం చైనా వైపు
- ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అధిక ఆదరణ.. సర్వేలో వెల్లడి
- చైనా పట్ల పెరుగుతున్న సానుకూలత.. అమెరికాపై తగ్గుతున్న విశ్వాసం
- స్వేచ్ఛా హక్కుల్లో అమెరికాకు ఆధిక్యం.. జోక్యం విషయంలో చైనాకు మద్దతు
- యూరప్ దేశాల్లోనూ చైనా వైపు పెరుగుతున్న ఆసక్తి
- భారత్, జపాన్, దక్షిణ కొరియా సహా ఆరు దేశాలే అమెరికా అనుకూలం



హైదరాబాద్
భూతల స్వర్గంగా పిలువడే అమెరికాను ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. స్వేచ్ఛా, స్వాతంత్రాలకు పెట్టింది పేరైనా అమెరికాను సందర్శించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. లేటెస్ట్ టెక్నాలజీ, స్వేచ్ఛాయుతమైన జీవనం వంటి పలు కీలక అంశాల్లో ముందుండే యూఎస్‌ని మెజార్టీ ప్రజలు ఇష్టపడుతుంటారు.
కానీ, నేడు పరిస్థితులు అందుకు విరుద్ధంగా మారిపోయాయి. అమెరికా కంటే చైనానే ఎక్కువ మంది ఇష్టపడున్నారని ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలడం ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాదు ప్రపంచంలో సూపర్ పోలీస్‌గా వెలుగొందుతూ పెద్దన్న పాత్ర పోషిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కంటే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కే ఎక్కువ ప్రజాధరణ లభించడం మరో విశేషం.
ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అత్యధిక ప్రజాదరణ..
వివరాల్లోకి వెళ్తే..ప్యూ రీసెర్చ్ సెంటర్ ఇటీవల కొత్తగా నిర్వహించిన తాజా గ్లోబల్ సర్వేలో అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కంటే, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది అభిమానాన్ని పొందినట్లు వెల్లడైంది. అమెరికా కేంద్రంగా పనిచేసే ఈ నిష్పక్షపాత సంస్థ వెల్లడించిన ఫలితాల ప్రకారం..36 దేశాల్లో సర్వే చేపట్టగా 25 దేశాల్లోని ప్రజలు అమెరికా కంటే చైనాను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అలాగే 22 దేశాలలో షి జిన్‌పింగ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కంటే ఎక్కువ ప్రజాదరణ ఉందని తేలింది. అనేక దేశాలలో చైనా పట్ల సానుకూల అభిప్రాయాలు రోజు రోజుకు రికార్డు స్థాయికి పెరుగుతుండగా.. మరోవైపు అమెరికా పట్ల సదాభిప్రాయాలు క్షీణించాయి. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా నాయకుడు షీ జిన్‌పింగ్ ఇద్దరిపైనా ప్రజలు తక్కువ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ ట్రంప్ కంటే జిన్‌పింగే ఎక్కువ స్కోరు సాధించారు. వ్యక్తిగత స్వేచ్ఛలను చైనా కంటే అమెరికానే ఎక్కువగా గౌరవిస్తుందని సర్వేలో పాల్గొన్న ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఇతర దేశాల వ్యవహారాలలో అమెరికా కంటే చైనా తక్కువగా జోక్యం చేసుకుంటుందని బలంగా నమ్ముతున్నారు. ప్యూ సంస్థ ఫిబ్రవరి, మే నెలల మధ్య 36 దేశాలలో 42,000 మందికి పైగా ప్రజలను సర్వే చేసి ఈ వివరాలను వెల్లడించింది.
యూరప్ చూపు చైనా వైపు..
చైనా వైపు మొగ్గు చూపిన దేశాలలో స్పెయిన్, ఇండోనేషియా, ఇటలీ, గ్రీస్, కెనడా ఉన్నాయి. కేవలం ఆరు దేశాలు మాత్రమే అమెరికాకు మద్దతుగా నిలిచాయి. వీటిలో చాలా వరకు అమెరికాకు బలమైన మిత్ర దేశాలుగా ఉన్నవే కావడం గమనార్హం. అవి వరుసగా పోలాండ్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, భారతదేశం, జపాన్, ఇజ్రాయెల్. అలాగే మరో 20 దేశాలలో అమెరికా పట్ల అనుకూల అభిప్రాయం ఇటీవలి కాలంలో స్థిరంగా తగ్గుతూ వస్తోందని కూడా సర్వేలో తేల్చారు. అదే సమయంలో చైనా పట్ల అనుకూల అభిప్రాయం పెరుగుతూ వస్తోందని కూడా ఆ సంస్థ గుర్తించింది.

# మయన్మార్ తీరంలో ఘోర విషాదం..

- రెండు శరణార్థి పడవలు బోల్తా
- 500 మందికి పైగా గల్లంతు.. మృతి చెందినట్లు ఐరాస సంస్థల అంచనా
- రఖైన్ నుంచి బయలుదేరిన పడవలు.. ఎక్కువ మంది రోహింగ్యా ప్రయాణికులు
- బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారూ ఉన్నట్లు సమాచారం
- భారీ ప్రాణనష్టంపై ఐరాస ఆందోళన
- అండమాన్ సముద్రం, బంగాళాఖాతం మార్గం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- తొలి పడవలో 250 మంది.. రెండో పడవలో 280 మంది ప్రయాణికులు



న్యూఢిల్లీ
ప్రాణాలకు రక్షణ, మెరుగైన జీవన పరిస్థితుల కోసం శరణార్థులు ప్రమాదకర స్థితిలో సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల శరణార్థులతో వెళ్లిన రెండు పడవలు మయన్మార్ తీరం లో బోల్తాపడి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలిపాయి. ఆ పడవల్లో మొత్తం 500 మంది ఉన్నారని, వారంతా మరణించి ఉండవచ్చని పేర్కొన్నాయి.ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈ రెండు పడవలు జూన్ చివరలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బయలుదేరాయని, వాటిలో ఎక్కువ మంది రోహింగ్యా జాతికి చెందిన ప్రయాణికులేనని అంతర్జాతీయ వలస సంస్థ, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన కొందరూ ఆ పడవల్లో ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనల్లో 500 మందికిపైగా మృతి చెందినట్టు భావిస్తున్నామని పేర్కొన్నాయి.అయితే ఈ ఘటనలు, మృతుల సంఖ్యపై ఇంకా అధికారికంగా ధ్రువీకరణ రాలేదని, అయినా భారీగా ప్రాణనష్టం జరిగి ఉండవచ్చన్న అంశంపై యూఎన్‌హెచ్‌సీఆర్, ఐఓఎమ్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయని సంయుక్త ప్రకటనలో ఆ సంస్థలు పేర్కొన్నాయి. 2025లో అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో దాదాపు 900 మంది రోహింగ్యా శరణార్థులు అదృశ్యమయ్యారు లేదా ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. దాంతో ఈ సముద్ర మార్గం ప్రపంచంలోనే వలసదారులు, శరణార్థులకు అత్యంత ప్రమాదకర మార్గంగా మారిందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఐక్యరాజ్యసమితి సంస్థల సమాచారం ప్రకారం.. తొలి పడవ బయలుదేరిన కొద??దిసేపటికే దానితో సంబంధం తెగిపోయింది. అందులో దాదాపు 250 మంది ఉన్నారు. 280 మందితో ప్రయాణించిన రెండో పడవ జూలై 8న మయన్మార్‌లోని ఇరావడీ తీరంలో బోల్తాపడి ఉండొచ్చని భావిస్తున్నారు. సాధారణ నౌకాయాన కాలం ముగిసిన తర్వాత ఈ ప్రయాణాలు జరిగాయని, ఆ సమయంలో సముద్ర పరిస్థితులు సాధారణంగా మరింత ప్రమాదకరంగా ఉంటాయని ప్రకటనలో ఐరాస తెలిపింది. 2026లో కూడా రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులు కలిపి దాదాపు 300 మంది అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో అదృశ్యమైనట్టు సమాచారం అందిందని యూఎన్‌హెచ్‌సీఆర్, ఐఓఎమ్ తెలిపాయి.

### సెప్టెంబర్లో
# పురపోరు!

(మొదటి తరువాయి)


పార్టీల నడుమ సీట్ల సర్దుబాటుపైనా చర్చ జరిగింది. 80:15:5 నిష్పత్తిలో సీట్ల సర్దుబాటు ఉంటుందని, టీడీపీ 80 శాతం సీట్లు, జనసేన 15 శాతం, బీజేపీ 5 శాతం సీట్లలో బరిలోకి దిగుతాయని.. స్థానిక పరిస్థితులను బట్టి సర్దుబాటు చేసుకుందామని లోకేశ్ అన్నారు.



**27 నుంచి 'ఇంటింటికీ టీడీపీ'**
కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీడీపీ సిద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం చేపట్టాలని పార్టీ శ్రేణులను అధిష్ఠానం ఆదేశించింది. ఈ కార్యక్రమాన్ని 45 రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించారు. టీడీపీ ప్రజాప్రతినిధులతోపాటు వివిధ పదవుల్లో ఉన్న నాయకులంతా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు. వారానికి కనీసం 4 రోజులపాటు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని అధిష్ఠానం శ్రేణులకు దిశానిర్దేశం చేసింది.

# అవినీతి చేస్తే వేటే..

(మొదటి తరువాయి)



పతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్.. అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. ఈ క్రమంలో మొన్న కరూర్‌లో ఇటీవల నిర్వహించిన ప్రజాసభలో మాట్లాడుతూ.. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి ఏమాత్రం తావుండబోదని తేల్చిచెప్పారు. 'ఎవరైనా లంచం అడిగితే 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెంటే నేను ఉంటాను. అయినా ఒత్తిడి చేస్తే ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నారని ధైర్యంగా చెప్పండి' అంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టంచేశారు. ఇక అవినీతి నిర్మూలన కోసం విజయ్ ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

# రాష్ట్రానికి సిరిసంపదల నిలయం..

-నవ్యాంధ్ర అభివృద్ధికి కర్నూలే కేంద్రబిందువు

-సహజ వనరులు, పారిశ్రామిక అవకాశాలతో కర్నూలుకు ఉజ్వల భవిష్యత్‌కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు రూరల్ బ్యూరో, జూలై 16 (నేటి దర్శిని)** సహజ వనరులు, విస్తారమైన భూభాగం, జాతీయ రహదారులు, రైల్వే అనుసంధానం, పారిశ్రామిక అవకాశాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం వంటి అనేక ప్రత్యేకతలతో కర్నూలు జిల్లా నవ్యాంధ్ర అభివృద్ధికి కేంద్రబిందువుగా అవతరించబోతోందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పారిశ్రామికాభివృద్ధి విధానాలతో కర్నూలు పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మారుతోందని ఆయన తెలిపారు.కర్నూలు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బెంగళూరు--హైదరాబాద్ జాతీయ రహదారి, జాతీయ రహదారి 44, ఎన్‌హెచ్--167, జాతీయ రహదారి 40, రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయం వంటి సౌకర్యాలు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయని వివరించారు. కర్నూలు జిల్లా ఖనిజ సంపదకు నిలయమని



పేర్కొంటూ, సున్నపురాయి, బారైట్స్, ఇనుప ఖనిజం, గ్రానైట్‌తో పాటు బంగారం వంటి విలువైన ఖనిజాలు జిల్లాలో సమృద్ధిగా లభిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా తుగ్గలి మండలంలోని జొన్నగిరి ప్రాంతంలో బంగారు గనుల తవ్వకాలు ప్రారంభమవడం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలోనూ కర్నూలు ముందంజలో ఉందని, భారీ సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టులు జిల్లాలో ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ఆర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్, డ్రోన్ సిటీ, వివిధ పారిశ్రామిక పార్కుల అభివృద్ధితో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, అదే సమయంలో కర్నూలు జిల్లాకు సాగు, పరిశ్రమలు, తాగునీటి రంగాల్లో మరింత ప్రాధాన్యం పెరుగుతుందని వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. కర్నూలును దక్షిణ భారత పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని, పారిశ్రామికవేత్తలు కర్నూలులో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# పుట్టపర్తిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

-మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**శ్రీ సత్యసాయి, జూలై 16 (నేటి దర్శిని)**
శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గాన్ని ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి పర్యాటక నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాన్ని సుందరీకరించి, దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని వెల్లడించారు. గురువారం రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో కలిసి పుట్టపర్తి చిత్రావతి నదీ పరివాహక ప్రాంతం, బుక్కపట్నం చెరువు, చెరువు మధ్యలో ఏర్పాటు చేయనున్న శ్రీ



సత్యసాయి బాబా విగ్రహ స్థలం, కొండపై ఉన్న శ్రీ వెంకటరమణస్వామి ఆలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రతిపాదిత అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి, రూపకల్పన, అమలు విధానంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, చిత్రావతి నదీ తీరాన్ని ప్రకృతి అందాలతో సుందరీకరించి పర్యాటకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. బుక్కపట్నం చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు, చెరువు మధ్యలో భారీ శ్రీ సత్యసాయి బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా పుట్టపర్తికి వచ్చే భక్తులు, సందర్శకులకు కొత్త పర్యాటక ఆకర్షణ అందుబాటులోకి వస్తుందన్నారు. అలాగే కొండపై ఉన్న శ్రీ వెంకటరమణస్వామి ఆలయ పరిసరాలను అభివృద్ధి చేసి, వీక్షణ స్థలాలు, విశ్రాంతి కేంద్రాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య వసతులు, మెరుగైన రహదారులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, పర్యాటక అభివృద్ధిని సమన్వయం చేస్తూ పుట్టపర్తిని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# పల్లెల్లో బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలి

-ఎక్సైజ్ ఎస్ఐకి వినతి

**అనంతపురం బ్యూరో, జూలై 16 (నేటి దర్శిని)** సింగనమల నియోజకవర్గంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపుల వ్యవహారంపై ఎక్సైజ్ ఎస్ఐని కలిసి శింగనమల వైసీపీ సమన్వయకర్త మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో యువత, కూలీలు, పేద కుటుంబాలు ఈ అక్రమ మద్యం విక్రయాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నాయని, వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకుని బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంలో విఫలమైతే, బెల్ట్ షాపుల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, అవసరమైతే సంబంధిత ఎక్సైజ్



కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట కూడా నిరసన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ మద్యం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర విషాదంలోకి వెళ్లాయని, కల్తీ మద్యం కారణంగా ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగనమల మండల కేంద్రంలో ఉదయం నాలుగు ఐదు గంటలకే బెల్ట్ షాపులు తీస్తూ మద్యాన్ని విక్రయిస్తున్నారు. నిన్నటి రోజున సింగనమల మండల కేంద్రంలో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆ ఇంటిలో ఆడబిడ్డలు అనాథలుగా జీవనం సాగిస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఈరోజు అండగా నిలిచింది ఎవరు? వారి జీవితాలకు బాధ్యత ఎవరిది? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నిర్మూలించి, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతతో రాజీ పడే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకుని బెల్ట్ షాపులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# ఓటు హక్కు చాలా విలువైనది..

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిని గోవిందు

**శ్రీ సత్యసాయి, జూలై 16 (నేటి దర్శిని)**
: ఓటు హక్కు ప్రతి పౌరుడి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దానిని ప్రాణం కన్నా గొప్పదిగా భావించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి అంపావతిని గోవిందు పిలుపునిచ్చారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశంలోని ప్రతి వయోజన పౌరుడికి ఓటు హక్కు సులభంగా లభించలేదని, దాని వెనుక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన చారిత్రక పోరాటం ఉందన్నారు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశాల సమయంలో మహాత్మా గాంధీ చదువుకున్న వారికి మాత్రమే, జవహర్‌లాల్ నెహ్రూ పన్నులు చెల్లించే వారికి మాత్రమే, సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఉన్నత కులాల వారికి మాత్రమే ఓటు హక్కు ఇవ్వాలనే ప్రతిపాదనలు చేసినప్పటికీ, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి కుల, మత, భాష, ప్రాంత, లింగ భేదం లేకుండా వయోజనులందరికీ ఓటు హక్కు సాధించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల



సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఓటరు నమోదు ప్రక్రియకు ఎన్నికల సంఘం గడువును జూలై 24, 2026 వరకు పొడిగించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం ప్రజలకు ఓటు హక్కు కల్పించడం వల్లే రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కనీసం కొంత మేర అయినా అమలు చేయాల్సి వస్తోందని గోవిందు అన్నారు. ప్రజాస్వామ్యంలో రక్తపాతం లేకుండా ప్రభుత్వాలను మార్చగలిగే అపార శక్తి ఒక్క ఓటుకు మాత్రమే ఉందని చెప్పారు. అందువల్ల ఓటు విలువను ప్రతి పౌరుడు గుర్తించాలని సూచించారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బు లేదా ఇతర ప్రలోభాలకు లొంగి ఓటు వేయడం ద్వారా ప్రజలు తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వల్ప మొత్తానికి ఓటు విక్రయించిన ప్రజలు, అనంతరం అధికారంలోకి వచ్చిన వ్యక్తులు లేదా పార్టీలు కోట్లాది రూపాయలు సంపాదిస్తూ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా పాలన సాగించే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీనివల్ల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణమైన పాలన అమలుకావడం లేదని వ్యాఖ్యానించారు. కాబట్టి ప్రతి ఓటరుడు తన ఓటును సాధారణ కాగితం ముక్కలా కాకుండా అత్యంత విలువైన రాజ్యాంగ హక్కుగా భావించి, ఆలోచించి వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఓటు హక్కును కాపాడుకోవడం ద్వారా రాజ్యాంగ విలువలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బహుజన నాయకులు రొడార్పు హరిప్రసాద్, రిటైర్డ్ టీచర్ నరసింహులు, గాదలపురి నారాయణస్వామి, ప్రసాద్, నరసింహులు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు దాహార్తికి ఊరట..

- ఎల్‌ఎల్‌సీకి 900 క్యూసెక్కుల నీటి విడుదల



**కర్నూల్ రూరల్ బ్యూరో, జూలై 16 (నేటి దర్శిని)** జిల్లాలో తీవ్ర తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం స్పందించింది. కలెక్టర్ పంపిన ఇండెంట్ మేరకు తుంగభద్ర జలాశయం నుంచి గురువారం దిగువ కాలువ (ఎల్ఎల్‌సీ)లోకి 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.జ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, చెరువుల్లో నీటి కొరత నేపథ్యంలో తుంగభద్ర జలాశయం నుంచి 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రతిపాదనపై స్పందించిన ప్రభుత్వం తొలి విడతగా 900 క్యూసెక్కుల నీటిని ఎల్ఎల్‌సీ కాలువలోకి విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. విడుదలైన నీరు దశలవారీగా కర్నూలు జిల్లాలోని చెరువులు, గ్రామీణ మంచినీటి పథకాలకు చేరేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నీటిని వ్యవసాయ అవసరాలకు మళ్లించకుండా పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు శాఖలు సంయుక్తంగా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సంక్షోభాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యతో ప్రజలకు కొంత మేర ఉపశమనం లభించనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి

-డీఎఓ సాలు రెడ్డి



**రాప్తాడు, జూలై 16 (నేటి దర్శిని)**
ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉండడం వలన కంది పంటలో తల్లి సాలు పక్కనే మడకసాలు దున్నడం ద్వారా వర్షం పడినప్పుడు భూమి లోకి నీరు బాగా ఇంకి పంటకు ఎక్కువ రోజులు నీటి ఎద్దడి లేకుండా ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.సాలు రెడ్డి పేర్కొన్నారు.రాప్తాడు మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ నందు వేరుశనగ కంది ఇతర పంట పొలాలను పరిశీలించారు.ఈ సంధర్భంగా రైతులతో కలిసి మాట్లాడుతూ.. జులై 31 వరకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి గడువు పొడిగించడం వలన పంటలు సాగు చేసిన ప్రతి రైతు కూడా ఇన్సూరెన్స్ ను బ్యాంకుల నందు చేయించుకోవాలని తెలిపారు.క్రాప్ లోన్ లేని రైతులు సిఎస్ సి లో లాగిన్ చేయించుకోవాలి అని అన్నారు.అలాగే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ-పంట నమోదు కార్యక్రమం ప్రారంభించామని పంట సాగు చేసిన ప్రతి రైతు కూడా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ఏ.వెంకట్ కుమార్ మండల వ్యవసాయ అధికారి ఎస్.కృష్ణ చైతన్య ఏఈవోలు సుజిత రంజిత ఆర్ ఎస్ కే సిబ్బంది లక్ష్మి సోనియా భార్గవ్ రైతులు పాల్గొన్నారు.

# రూ.3,216 కోట్ల రుణాల పంపిణీకి సర్వం సిద్ధం


నరసరావుపేటలో క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంపై సమీక్ష..

సమన్వయంతో విజయవంతం చేయాలని ప్రతిపాటి పుల్లారావు పిలుపు



**చిలకలూరిపేట, జూలై 16 (నేటి దర్శిని)**
నరసరావుపేటలో నిర్వహించనున్న భారీ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం ద్వారా రూ.3,216 కోట్ల రుణాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరుకానున్నారు.శుక్రవారం నరసరావుపేట ఇండోర్ స్టేడియంలో జరగనున్న కార్యక్రమం ఏర్పాట్లపై గురువారం చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి పాల్గొన్న మంత్రి ప్రతిపాటి పుల్లారావు, కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఆర్థిక అసమానతలను తగ్గించడంలో బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా రుణాల మంజూరు ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారీ రుణ పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# హుషార్ పిట్టలు' నుంచి 'టోంగా.. టోంగా' సాంగ్ రిలీజ్




అన్ను, వాసవి గణేషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు' . పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది.దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు.



## హాట్ ఫోటో షూట్‌లతో మతిపోగుడుతోన్న శృతి హాసన్...

# టాక్సిక్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా?





కేజీఎఫ్ 2 తర్వాత లాంగ్ గ్యాప్ తీసుకున్న యశ్ ఇప్పుడు టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడుతూ వస్తోన్న ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ ఈ సినిమా రిలీజ్ కానుండడం విశేషం. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో ఏకంగా ఐదు గురు హీరోయిన్లు నటిస్తున్నారు. నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ యశ్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటివరకు విడుదలైన టీజర్లు, పాటలను బట్టి చూస్తే, ఈ చిత్రంలో చాలా హాట్ సీన్లు, యాక్షన్ సీన్లు ఓ రేంజ్ లో ఉంటాయని స్పష్టమవుతోంది. అయితే ఇందులో బ్రదర్ అండ్ సిస్టర్ సెంటిమెంట్ కూడా ఉందని తెలుస్తోంది. మరి ఇందులో యశ్ చెల్లెలిగా ఎవరు నటిస్తున్నారన్నది ఆసక్తికరంగా మారింది. కొందరేమో లేడీ సూపర్ స్టార్ నయనతార యశ్ కు సిస్టర్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఈ సంగతి పక్కన పెడితే టాక్సిక్ సినిమాలో పలువురు బాలీవుడ్ ముద్దుగుమ్మలు నటిస్తున్నసంగతి తెలిసిందే. కియారా అద్వానీ మెయిన్ హీరోయిన్ అని ఇప్పటికే తెలిసిపోయింది. అలాగే హ్యుమా ఖురేషి, తారా సుతారియా కూడా యశ్ సినిమాలో యాక్ట్ చేస్తున్నారు. అయితే వీరందరి కంటే ముందే ఓ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కు టాక్సిక్ సినిమాలో అవకాశం వచ్చింది. కానీ ఆమె రిజెక్ట్ చేసింది. అలా చేజేతులా గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్న ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు కరీనా కపూర్.హిందీలో స్టార్ హీరోయిన్ గా వెలుగొందుతోన్న కరీనాకు టాక్సిక్ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఏ పాత్ర అనేది తెలియదు కానీ యశ్ తో కరీనా నటిస్తుందని తెగ ప్రచారం జరిగింది. ఒక వేళ ఇదే జరిగి ఉందే కరీనాకు ఇదే మొదటి దక్షిణాది సినిమా అయ్యేది . అలాగే ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయ్యేది. అయితే ఏమైందో తెలియదు కానీ ఉన్నట్లుండి టాక్సిక్ సినిమా నుంచి తప్పుకుంది కరీనా. ఆ తర్వాతా ఆమె ప్లేస్ లోకి లేడీ సూపర్ స్టార్ నయనతార చేరిందని తెలుస్తోంది. ఇక టాక్సిక్ సినిమా విషయానికి వస్తే.. కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ సహా పలువురు విదేశీ నటీనటులు కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా సంగీతం అందిస్తున్నారు. కొన్ని పాటలకు విశాల్ కూడా సంగీతం అందించారు.

# తమిళంలో బంపరాఫర్



'కాంతార: ఛాప్టర్ 1' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపును సంపాదించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఆమె యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' వంటి భారీ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిసింది. రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్– ది డెడ్లీ డాక్టర్'లో ఈ భామ కీలక పాత్రకు ఎంపికైందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కథాగమనంలో ఆమె క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు.'ధర్మన్' చిత్రంలో సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా ఇంపార్టెంట్ రోల్‌లో కనిపించనుంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.

# 'ఫౌజీ' వచ్చేది అప్పుడే



రెబెల్ స్టార్ ప్రభాస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ'తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హను రాఘవపుడి దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో, టి–సిరీస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అద్భుతమైన టైటిల్ పోస్టర్‌తో అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో 'ఫౌజీ' ప్రపంచాన్ని, సినిమా భారీ స్థాయిని అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని రగ్డ్, ఎమోషనల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన ఓ యోధుడిలా, రక్తంతో తడిసిన దుస్తులు, శరీరమంతా గాయాలతో, చుట్టూ నేలకూలిన సైనికుల మధ్య తుపాకీని పట్టుకుని నిశ్శబ్దంగా కూర్చున్న ప్రభాస్ లుక్ అదిరిపోయింది. ఆయన లుక్ ఓ యోధుడి త్యాగం, బాధ, ధైర్యం, పట్టుదలను చూపిస్తోంది. పొడవాటి జుట్టు, గడ్డం, యుద్ధం వల్ల అలసిపోయిన శరీరం, రక్తపు మరకలతో ఉన్న తెల్లటి ధోతీలో ప్రభాస్ చేసిన మేకోవర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. తన హావభావాలతోనే బాధ, ధైర్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచే విధంగా పోస్టర్ రూపొందించారు. ముఖ్యంగా ఈ పోస్టర్ సినిమాలోని అత్యంత భారీ యాక్షన్ ఎపిసోడ్‌లలో ఒకదానికి సంబంధించినది. థియేటర్లలో ఈ సీక్వెన్స్ ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఫౌజీ' కేవలం యుద్ధ నేపథ్య చిత్రమే కాకుండా, భావోద్వేగాలతో కూడిన గొప్ప సినీ అనుభూతిని అందించే చిత్రంగా రూపొందుతున్నట్లు పోస్టర్ తెలియజేస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450